ఆకలితీర్చిన అమృతమూర్తి !

- సత్యసాయి జయంతి వేడుకల్లో లక్షలాది మందికి అన్నదానం
- శత జయంత్యుత్సవాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- పెద్దఎత్తున నారాయణ సేవకు చర్యలు

6



నారాయణసేవ అందిస్తున్న సత్యసాయి(ఫైల్)

● బుల్లెట్ స్పీడ్..!

బుల్లెట్ బండి.. కళ్లజోడుతో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. వీరెవరో ఠక్కున గుర్తుపట్టడం కష్టం. ఠపీమణి చెప్పేయలేం. పరిశీలనగా చూస్తే.. బండిపై ఉన్నది ఎవరో కాదు, కలెక్టర్ శ్యాంప్రసాద్. వెనకాలే కూర్చున్నది జిల్లా పోలీసు బాస్ ఎస్పీ సతీష్‌కుమార్. ఇద్దరూ జిల్లా ఉన్నతాధికారులే. ఎప్పుడూ కార్లు, సిబ్బందితో వచ్చే వీరిరువురు బుధవారం ఇలా బుల్లెట్‌పై పుట్టపర్తి మొత్తం కలియదిరుగుతూ కనిపించారు. సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాలు, సిబ్బందితో అన్ని ప్రాంతాల్లో తిరగడం, ఏర్పాట్లను పరిశీలించడం ఆలస్యమవుతుందనో, అక్కడికి వాహనాలు వెళ్లలేవనో తెలియదు కానీ, ఇద్దరూ ఇలా బుల్లెట్‌పై పుట్టపర్తి మొత్తం తిరిగారు. హంగు, ఆర్భాటం లేకుండా పుట్టపర్తి పెట్రోల్ బంకు నుంచి పర్యటన మొదలెట్టారు. పరేడ్ గ్రౌండ్ దారిలో ఎడమవైపు పార్కింగ్ ఏరియా, పోలీసు పరేడ్ గ్రౌండ్, వెస్ట్ గేటు వద్ద చింతతోపు, చిన్నపల్లి స్కూల్ వద్ద, ఎయిర్‌పోర్టు నుంచి గణేష్ సర్కిల్ వరకు, చిత్రావతి నది అవతల వైపు, హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్, ఎస్పీ బుల్లెట్‌పై వెళ్తుండడాన్ని చూసిన పట్టణ ప్రజలు.. ఆశ్చర్యంగా చూశారు.

- పుట్టపర్తి టౌన్, ఆంధ్రజ్యోతి




బుల్లెట్ బండిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ.. అధికారులకు సూచనలు ఇస్తూ..



నేటి నుంచి సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

- పుట్టపర్తిలో పెరిగిన భక్తుల సందడి
- వేడుకలకు రానున్న రాష్ట్రపతి, ప్రధాని

(వివరాలు మెయిన్‌లో..)





నేడు చిల్డ్రన్ పార్కు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చిల్డ్రన్ పార్కు

పుట్టపర్తి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో చిత్రావతి నది ఒడ్డున జోయాలుక్కాస్ సంస్థ రూ.1.2కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును గురువారం ప్రారంభించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతులమీదుగా ఉదయం 10 గంటలకు పార్కు ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం పార్కులో వాకింగ్ చేయడానికి ట్రాక్, సేదదీరడానికి బెంచీలు, పిల్లలు ఆడుకోవడానికి వివిధ వస్తువులు పార్కులో ఏర్పాటు చేశారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ పార్కును ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జోయాలుక్కాస్ గ్రూపు మేనేజింగ్ ట్రస్టు ఎండీజాలీ చాయ్‌లుకాస్, కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

సొంతింటి కల సాకారం చేస్తాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ ● గృహ నిర్మాణాలకు భూమిపూజ




భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలు సొంతిళ్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో బీఎల్‌సీ గృహ నిర్మాణాలకు పూనుకున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్ సమీపంలోని శివాలయం వద్ద పీఎంఏవై(ప్రధానమంత్రి అవాస్ యోజన)కింద నిర్మించనున్న బీఎల్‌సీ గృహాలకు ఆయన బుధవారం భూమిపూజ చేశారు. మంత్రితోపాటు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు గృహపత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ఈ పథకం ప్రారంభమైందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించార న్నారు. రెండోవిడతలో మరో మూడు కోట్ల ఇళ్లను నిర్మించాలన్న సంకల్పంతో కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈక్రమంలోనే పట్టణంలో పీఎంఏవై కింద 945 గృహాలకు భూమిపూజ చేయగా 19 మంది ఇప్పటికే ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తోందన్నారు. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. 2014-2019 వరకు కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి దాదాపు 11లక్షల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అందులో 3.5లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయగా మిగతా ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పునాదులకే ఆపేసిందన్నారు. రాష్ట్రానికి 21.5లక్షల ఇళ్లను కేంద్రం కేటాయిస్తే అప్పటి సీఎం జగన్ తిరస్కరించారన్నారు. పట్టణానికి రూ.40కోట్లతో కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌ను మంజూరు చేసిందన్నారు. తద్వారా 22వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ఈ ప్రాజెక్టుపై సమీక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, తహసీల్దార్ సురేశ్‌బాబు, హౌసింగ్ ఈఈ లక్ష్మీనారాయణమ్మ, డీఈ వెంకటేశులు, ఏఈ చిరంజీవి, కూటమి నాయకులు కమతంకాటమయ్య, పరిశేసుధాకర్,రాళ్లపల్లిషరీఫ్, మాధవరెడ్డి, ఓబులేసు, గుండాపుల్లయ్య, పోతుకుంటరాజు పాల్గొన్నారు.

పేదల కల.. ప్రభుత్వం లక్ష్యం: మంత్రి సవిత

- ఘనంగా సామూహిక గృహ ప్రవేశాలు



గృహ ప్రవేశం చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని పెడపల్లిలో పీఎంఏవై 2.0 సామూహిక గృహప్రవేశాలను ఘనంగా నిర్వహించారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఇల్లులేని పేద ఒక్కరు కూడా ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పీఎంఏవై 2.0 లబ్ధిదారులకు ఇంటి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విధులను పంచేస్తేనే మేలు..!

కొందరిపైనే పని భారం

మిగిలిన వారికి సరదాగా ఉద్యోగం

ఆంధ్రజ్యోతి పరిశీలన

- సగానికిపైగా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇదీ పరిస్థితి
- విజన్ యూనిట్‌లోనైనా తీరు మారుతుందా..?

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో చాలామందికి విధులు సరదాగా మారాయి. తీరిగ్గా 11 గంటలకు కార్యాలయానికి వెళ్లి హాజరు వేసుకుని వెళ్లిపోతే చాలు.. నెల నెలా జీతం తీసుకోవచ్చు. కానీ కొందరికి మాత్రం తీరిక లేనంత పని ఉంటోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఒక్కో సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి ఈ నెల పదో తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీలించింది. ఆ సమయంలో (మిగతా 6వ పేజీలో..)



ధర్మవరం మండలం దర్మపురి సచివాలయంలో ఖాళీగా కుర్చీలు


శ్రీసత్యసాయి జిల్లాలో 544 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. మంజూరైన పోస్టులు 5,860 కాగా, 3,855 మంది పని చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2005 మంది సిబ్బంది కొరత ఉంది. దీని కారణంగా ఉన్నవారిపై భారం పడుతోంది. సచివాలయ సిబ్బందిలో సమయపాలన పూర్తిగా లోపించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణం. జిల్లాలో చాలా సచివాయాలల్లో ఉదయం 11గంటలైన విధులకు హాజరు కాలేదు. సమస్యలతో వచ్చిన ప్రజలు వారి కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు ఉద్యోగులు సచివాలయంలో బయోమెట్రిక్ వేసి.. విధుల పేరిట బయటకు వెళ్లిపోయారు.

- ధర్మవరం మండలం మల్లాకాల్వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. మిగిలినవారు ఫీల్డ్‌కు, ధర్మవరానికి వెళ్లారని ఉన్న సిబ్బంది తెలిపారు. సచివాలయానికి ప్రజలు ఎవరూ రాకపోవడంతో ఖాళీగా ఉండిపోయారు. నేలకోట సచివాలయంలో మధ్యాహ్నానికే ఉద్యోగులు ఉండరని గ్రామస్థులు తెలిపారు.



పుట్టపర్తి సచివాలయం-2లో తొమ్మిది మంది సిబ్బందికిగాను ముగ్గురు హాజరు

- మడకశిర మండలం హరేసముద్రం గ్రామ సచివాలయంలో 10 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అందరూ ఉదయం 10 నుంచి 10.30 గంటలోపు వచ్చారు. పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్, మహిళా పోలీసు, వెల్ఫేర్ అసిస్టెంట్ సచివాలయంలో ఉండిపోగా.. మిగిలిన ఫీల్డ్ విజిట్, మడకశిరలో మీటింగ్ పేరిట వెళ్లిపోయారు.
- తనకల్లులో మూడు సచివాలయాలు ఉన్నాయి. మూడో సచివాలయాన్ని గుంజువారిపల్లిలో ఏర్పాటు చేశారు. ఆ తరువాత అద్దె సరిగా చెల్లించలేదని ఒకటో సచివాలయంలోని సేవా కేంద్రానికి మార్చారు. ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్ మండల ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తున్నారు. దీంతో ఆధార్ కేంద్రంగా మారిపోయింది. ఇక్కడ మిగిలిన సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. సోమవారం డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో కనిపించచారు. అందరూ క్యాంపులకు వెళ్లి, ఫీల్డుకు వెళ్లారని ఆయన తెలిపారు.



హరేసముద్రం గ్రామ సచివాలయం



తనకల్లులో డిజిటల్ అసిస్టెంట్ ఆధార్ సేవలు



కదిరిలోని 4వ సచివాలయంలో సిబ్బందిలేక ఖాళీగా ఉన్న కుర్చీలు

15 రోజులుగా తిరుగుతున్నా..



మా భూములు తనకల్లు 3వ సచివాలయం పరిధిలో ఉన్నాయి. కేంద్రం ప్రకటించిన అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాలేదు. దీంతో 15 రోజులుగా తిరుగుతున్నాను. వీఆర్వో అందుబాటులో లేరు. ఇక్కడికి వస్తే అక్కడికి వెళ్లమంటారు. అక్కడికి వెళితే ఇక్కడికే వెళ్లమంటారు. తిరగడమే సరిపోయింది. దిక్కు తోచడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సచివాలయ సిబ్బంది ఇలా వ్యవహరిస్తున్నారు.

-అంజినమ్మ, తనకల్లు

ఆ నిధులు ఏమయ్యాయి..?

- పంచాయతీల్లో కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు
- 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి



కటారుపల్లి సచివాలయం ఎదురుగా నిలిచిన మురుగునీరు



కొట్లపల్లిలో తాగునీటి బోరు వద్ద పైప్‌లైన్ లీకేజీతో కలుషితమవుతున్న నీరు

గాండ్లపెంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఏమవుతున్నాయో అంతుచిక్కడం లేదు. కనీసం చిన్న చిన్న సమస్యలను కూడా ఏళ్లతరబడి అలాగే వదిలేశారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధుల విషయంలో అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిధులతో పంచాయతీల్లో ఎక్కడా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తోంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే వివిధ పనులు ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టామంటూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై నిధులు కాజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.59.55 లక్షలు

గాండ్లపెంట మండలంలో 14 పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా ఏప్రిల్ నెలలో అన్ని పంచాయతీలకు కలిపి రూ. 59,55,368 నిధులు విడుదలయ్యాయి. విడుదలయిన నిధుల వివరాలు పంచాయతీల వారిగా ఇలా ఉన్నాయి. చామలగొంది పంచాయతీకి రూ. 2,66,515, జి. పెద్దతండాకు రూ. 3,84,947, గాండ్లపెంటకు రూ. 6,39,648, గొడ్డువెలగలకు రూ. 4,61,817, జీనులకుంటకు రూ. 1,81,581, కటారుపల్లికి రూ. 8,12,075 విడుదలయ్యాయి. అదే విధంగా కురుమామిడికి రూ. 4,16,574, మద్దివారిగొందికి రూ. 2,61,243, మలమీదపల్లికి రూ. 8,44,213, సోమయాజులపల్లికి రూ. 5,14,777, టి.పెద్దతండాకు రూ. 2,77,855, తుమ్మలబైలుకు రూ. 1,33,822, తూపల్లికి రూ. 3,45,253, వేపరాలకు రూ. 4,12,548 మొత్తం కలిపి రూ. 59,55,368 నిధులు విడుదలయ్యాయి. ఇందులో ఎలక్ట్రికల్ చార్జెస్ 10 శాతం, బోరు మోటార్లు, వీధిలైట్లు వినియోగానికి వాడిన కరెంట్ బిల్ 10 శాతం, వీధి దీపాలకు 10 శాతం నిధులు ప్రభుత్వం తీసుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

కనీస సౌకర్యాలూ కరువు..

గాండ్లపెంట మండల వ్యాప్తంగా పలు పంచాయతీలలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని స్పష్టమవుతోంది. దీంతో గ్రామాల్లో అపరిశుభ్రత, నీటి పైప్‌లైన్ల లీకేజి, అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లకు ఇరువైపుల ముళ్లకంపలు లాంటి సమస్యలు అడగడుగునా కనిపిస్తున్నాయి. ఈ సమస్యలపై సర్పంచులు, అధికారులకు ఫిర్యాదు చేసినా నిధులు లేవంటూ సాకులు చెబుతున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. విద్యుత్ బల్బులు వెలగకపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయనీ, కుక్కల భయం, దొంగల భయం ఉన్నాయని వాపోతున్నారు. పలు గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయి వీధుల వెంబడి నీరు వృథాగా పోతున్నాయి. బోరు మోటార్ల వద్ద లీకేజీలతో బురదగుంటగా మారి నీరు కలుషితమై బోర్లలోకి ఇంకుతున్నాయి. దీంతో కలుషిత నీరు తాగి జనం రోగాల బారిన పడుతున్నారు. కటారుపల్లి సచివాలయం ఎదురుగా రెండు సంవత్సరాలుగా వర్షపు నీరు నిలుస్తోంది. సర్పంచ్, అధికారులు నీటిని పక్కకు మళ్లించాలనే ఆలోచన కూడా చేయలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. వచ్చిన నిధులు ఏమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తీర్మానాలు లేకుండానే బిల్లులు

పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశాల్లో తీర్మానాలు చేసి బిల్లులకు ఆమోదం పొందాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదని తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కుమ్మక్కై నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పంచాయతీలో వార్డు సభ్యులకు తెలియకుండానే ఎంపీడీఓ కార్యాలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి కమీషన్‌లు తీసుకుంటూ బిల్లులు చెల్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నాం

అభివృద్ధి పనుల్లో అవినీతి జరగడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను గతంలో చేపట్టిన పనులకు మాత్రమే బిల్లులు అందిస్తున్నాం. గతంలో పలు అభివృద్ధి పనులు చేశారు. అప్పట్లో నిధులు రాలేదు. వచ్చిన నిధులను ఇప్పుడు బిల్లులు చేసుకుంటున్నారు.

-సునీత, ఈఓఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

టీడీపీకి కార్యకర్తలే సైనికులు

- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి
- జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



మాట్లాడుతున్న కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, నవంబరు 12 ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే సైనికులు అని జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పేర్కొన్నారు. స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామస్థాయి పార్టీ పదవులు పొందిన వారి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎదురొడ్డి టీడీపీకి కార్యకర్తలు అండగా నిలబడ్డారన్నారు. అదేస్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సురేంద్ర, మున్సిపల్ చైర్మన్ రమేష్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, పరిమళ, శ్రీదేవి, గంగాధర్, షబ్బీర్, మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వత్థనారాయణ రెడ్డి, కన్వీనర్లు వెంకటేశ్, రాము, అభి, శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్, సీనియర్ నాయకులు నాగరాజు, రామాంజినమ్మ, శివశంకర్, రఘు, అమర్నాథ్, మారుతి పాల్గొన్నారు.

చెరువుకు నీరు.. కరువు తీర్చేలా పైరు


నిండిన కరుట్లపల్లి చెరువు

చెరువు నిండుగా నీరు ఉండటంతో ఆయకట్టు భూములు పసిడి పంటలతో కళకళలాడుతున్నాయి. మండలంలోని కరుట్లపల్లి గ్రామ చెరువును హంద్రీనీవా నీటితో నింపారు. దీంతో ఆ చెరువు ఆయకట్టు కింద ఉన్న దాదాపు 500 ఎకరాలు సాగులోకి వచ్చింది. ఆ భూముల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి కరుట్లపల్లి చెరువుకు నీటిని మళ్లించారు. అప్పటి నుంచి చెరువు కింద ఆయకట్టు సాగుతోపాటు భూగర్భ జలాలు పెరిగి ఇతర బీడు భూములు కూడా సాగు లోకి వచ్చాయి. ఈ ఏడాది చెరువు పూర్తిగా నిండటంతో దిగువనున్న సింగంపల్లి చెరువు కూడా సరఫరా చేశారు. సక్రమంగా నీరుంటే భూమి కడుపున బంగారం పండిస్తామని పలువురు రైతులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కూడేరు


కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీ

పుట్టపర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీని వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బెంగళూరులోని బృందావనం క్యాంపస్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సైక్లింగ్ ఫర్ సాయి పేరిట విద్యార్థులు చేపట్టిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ చిక్‌బళ్లాపూర్‌లోని నందగిరి మీదుగా గురువారం ప్రశాంతి నిలయానికి చేరుకుంటుంది. పర్యావరణ పరిరక్షణ కోసమే ఈ ర్యాలీని చేపట్టినట్లు కళాశాల సిబ్బంది పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయి హిల్‌వ్యూ స్టేడియంలో సైకిల్ ర్యాలీ ముగుస్తుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శ్రీకాంత్ కన్నా, లెక్చరర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగీత కార్యక్రమాలు


ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద బాబా చిత్రపటానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

పుట్టపర్తి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మండపంలో గురువారం నుంచి 17వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు అనిల్‌బాన్‌రామ్ ఫ్లూట్ వాయిద్యం, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 14న కుమారి రూప సితార్ వాయిద్యం, 15న విదేశీ భక్తుల సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు, 16న ఔజాద్ అలీ ఖాన్ బృందం వాయిద్యకచేరి, 17న పండిట్ విస్నాత మోహన్ బట్టు బృందం వీణ వాయిద్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆకలితీర్చిన అమృతమూర్తి !

- సత్యసాయి జయంతి వేడుకల్లో లక్షలాది మందికి అన్నదానం
- శత జయంత్యుత్సవాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- పెద్దఎత్తున నారాయణ సేవకు చర్యలు



పుట్టపర్తి/ధర్మవరం నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా.. ప్రజల సేవకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. అందులో భాగంగానే నారాయణ సేవకు శ్రీకారం చుట్టారు. సత్యసాయి పుట్టిన రోజు వేడుకల్లో నారాయణ సేవలో భాగంగా లక్షల మందికి అన్నదానం చేస్తారు. సత్యసాయి శివైక్యం తర్వాత కూడా నారాయణ సేవ కొనసాగిస్తున్నారు. ఈసారి శత జయంత్యుత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తరలిరానున్నారు. అందుకు అనుగుణంగా నారాయణ సేవ చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా.. ఏటా నవంబరులో పుట్టపర్తిలో ఈ సేవ ప్రత్యేకం. అలాంటి నారాయణ సేవకు ఎలా బీజం పడిందో తెలుసుకుందాం.

1960లో ప్రారంభం

సత్యసాయి బాబా ప్రేమతో, భక్తితో జనులకు అవసరమైన సేవలను అందిస్తుంటారు. 1960లో నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ఏటా భక్తులకు నారాయణ సేవ అందిస్తున్నారు. సేవా సంస్థలు.. సత్యసాయి భక్తులు తమతమ ప్రాంతాల్లో నారాయణ సేవలను కొనసాగిస్తున్నారు. ఏటా ప్రశాంతి నిలయంలో లక్షల మందికి నారాయణ సేవ (అన్నదానం) చేస్తున్నారు. సత్యసాయి జన్మదిన వేడుకల సందర్భంగా నవంబరులో వారం రోజులపాటు లక్షల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. సత్యసాయి శివైక్యం తర్వాత ఏటా నవంబరులో జయంతి వేడుకల్లో లక్షలాది మంది భక్తులకు వస్త్రదానం, నారాయణసేవ అందిస్తున్నారు.


నారాయణసేవకు ఏర్పాటు చేసిన షెడ్లలో సౌకర్యాలు


శతజయంతి ఉత్సవాలకు దాదాపు పది లక్షల మంది భక్తులు రావచ్చని అంచనా. వారందరికీ నారాయణ సేవ అందించడానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అన్నదాన సేవలో ప్రపంచ వ్యాప్తంగా కోటికిపైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తుంటారు. సత్యసాయి జయంతి వేడుకలు, ఆరాధనోత్సవాలు, పండుగలు, గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి మందిరం, బస్టాండు, రైల్వేస్టేషన్, ఆస్పత్రులు, దేవాలయాల్లో నారాయణ సేవ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోనే సేవాసంస్థలు తమ పరిధిలో పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. ముఖ్యమైన పండుగలు, వారివారి పుట్టిన రోజు సందర్భంగా సేవాసంస్థల సభ్యులు.. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. వరదలు, విపత్తుల సమయాల్లో సైతం ఆయా ప్రాంతాలకు వెళ్లి, బాధితులకు అన్నదానం చేస్తుంటారు. ఈ లెక్కన ఏటా కోటి మందికి పైగా పేదలకు అన్నదానం చేస్తుంటారు.

అమృత కలశం పేరిట సేవలు..

సత్యసాయి అమృత కలశం పేరిట భక్తులు సేవలందిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని సేవాసంస్థల సభ్యులు తమ పరిధిలో పేదలకు అవసరమైన సేవలు చేస్తున్నారు. ప్రతినెలా నిత్యావసర సరుకులు పంచుతుంటారు. ఏటా లక్షల కుటుంబాలకు అమృతకలశం పేరిట వీటిని అందజేస్తుంటారు. సత్యసాయి బోధనలే శిరోధార్యమని భక్తులు పేర్కొంటున్నారు.

12 షెడ్లలో నారాయణసేవ

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సులభంగా నారాయణసేవను అందించడానికి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు చేపట్టారు. బుధవారం సాయంత్రానికే భక్తుల కోసం 12 షెడ్లను ఏర్పాటు చేశారు. ఈ షెడ్ల ద్వారా గురువారం నుంచి నారాయణసేవ అందించనున్నారు. ఇందులో ప్రశాంతి మందిరంలో రెండు షెడ్లు, ప్రశాంతి మందరం పడమర గేటు వద్ద ఆరు షెడ్లు, విమానాశ్రయం వద్ద ఒక షెడ్డు, కర్నాటక నాగేపల్లి వద్ద ఒకటి, ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వద్ద రెండు షెడ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లక్షల్లో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా అక్కడక్కడ ఈ షెడ్లను ఏర్పాటు చేసి నారాయణ సేవ అందించనున్నట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి.




ఆకలి తీర్చుతున్న దేవుడు సత్యసాయి: కేశప్ప, బుక్కపట్నం

సత్యసాయిబాబా శివైక్యం చెందినా ప్రజల గుండెల్లో కొలువై ఉన్నాడు. బాబా చేసిన సేవలు వేలకట్టలేనివి. ఆకలితో ఉన్న వాళ్లకు అన్నదాన సత్రాల ద్వారా ఆకలి తీర్చుతున్న దేవుడు. బాబా జయంతి ఉత్సవాలలోనే కాకుండా మిగతా సమయాల్లో కూడా నారాయణసేవ చేయడం సంతోకరం.

అన్నం పెట్టడం ఎంతో పుణ్యం

కరువుకు ప్రసిద్ధి చెందిన అనంతపురం జిల్లాలో ప్రజల దప్పిక తీర్చిన మహనాయుడు బాబా. ప్రతి ఏడాది సత్యసాయిబాబా జయంతి వేడుకలలో పదిరోజులపాటు పలువురు భక్తులు నారాయణసేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆకలిని తీర్చుతున్నారు. మనిషికి కడుపునిండా అన్నం పెట్టడం ఎంతో పుణ్యం.

- వెంకటరెడ్డి,
ఇండ్లవెంకటంపల్లి



విధులను

పంచే స్తేనే మేలు..!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఉదయం 10.30కు కొందరు.. 11 గంటల తరువాత కొందరు విధులకు వచ్చారు. మరికొందరు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. పనిభారం ఉన్నవారు మాత్రమే కార్యాలయంలో గడిపారు. కొందరు ఇలా వచ్చి, అలా వెళ్లిపోయారు. 'క్షేత్రస్థాయి పని' పేరిట ఎక్కువ మంది విధులకు డుమ్మా కొడుతున్నట్లు స్పష్టంగా అర్థమైంది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'వన్ విజన్ వన్ డైరెక్షన్' అనే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాలను విజన్ యూనిట్‌గా మారుస్తోంది. జనాభా ప్రాతిపదికన రీ గ్రూపింగ్ చేస్తోంది. జనాభా 2500 మంది కంటే తక్కువ ఉండే సచివాలయాలలో ఆరుగురు, 2500 నుంచి 3500 మంది ఉంటే ఏడుగురు, 3500కు పైగా జనాభా ఉంటే ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

ఆలస్యంగా విధులకు..

- నార్పల సచివాలయం-1లో ఉదయం 12 గంటలైనా ఒక వెటర్నరీ సచివాలయ ఉద్యోగి మాత్రమే హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు ఎవరూ రాలేదు. 12 గంటల తరువాత ఒక్కొక్కరు తీరుబడిగా వచ్చి విధుల్లో నిమగ్నమయ్యారు.
- గార్లదిన్నె మండలంలో ఉదయం 11 గంటలైన సచివాయాలకు సిబ్బంది రారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్, డిజిటల్, వెల్ఫేర్, హార్టికల్చర్, సెరికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు పని ఒత్తి ఉంది. వీఆర్వోలు, సర్వేయర్లు క్యాంపుల పేరుతో సచివాలయాలకు అడపాదడపా వస్తున్నారు. మహిళా పోలీసులకు ఏ మాత్రం పని లేదని చెబుతున్నారు.
- బుక్కరాయసముద్రం సచివాలయం -1లో ఉదయం 11 గంటలకు మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. మిగిలిన సిబ్బందిలో ఒకరికి రోడ్డు ప్రమాదం జరిగిందని, డిజిటల్ అసిస్టెంట్ మరో కారణంతో సెలవులో ఉన్నారు. వీఆర్వో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్లారో తెలియదు.
- అనంతపురంరూరల్ మండలంలోని ఉప్పరపల్లి, ఇటుకలపల్లి గ్రామ సచివాలయాల్లో పది మంది చొప్పున ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎక్కువ పని ఉంది. వీరి తరువాత ఏఎన్ఎం, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఓ మోస్తరు పని ఉంటోంది. మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పశువైద్య సిబ్బంది అడపాదడపా తప్పా మిగిలిన సమయాల్లో ఖాళీగా ఉంటున్నారు.
- అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని నవోదయకాలనీలో ఉన్న 40వ సచివాలయంలో 9 పోస్టులు ఉండగా...ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. మరో ఏడుగురు విధులకు ఆలస్యంగా వస్తారని అక్కడ ఉన్న వారు చెప్పారు. పక్కనే ఉన్న 41వ సచివాలయంలో 9మందిలో ఆరుగురు విధులకు హాజరయ్యారు. తమకు స్పష్టమైన జాబ్‌చార్ట్, అధికారి పర్యవేక్షణ బాధ్యత కేటాయిస్తే సక్రమంగా సమయపాలనతో విధులు నిర్వహిస్తామని సచివాలయ ఉద్యోగులు చెప్పుకొస్తున్నారు.
- కూడేరు మండలం తిమ్మాపురం గ్రామ సచివాలయంలో ఉదయం 10.30 గంటల్లోపు గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు మాత్రమే హాజరయ్యారు. 11 గంటలైనా ఇంజనీరింగ్ అసిస్టెంట్ హాజరుకాలేదు. మిగిలినవారు ఫీల్డ్‌కు వెళ్లినట్లు తెలిపారు.
- యాడికి మండలంలో సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా వారు ఫీల్డ్‌కు వెళ్లినట్లు చెబుతున్నారు. వీరిలో సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మాత్రమే విధులు ఎక్కువగా ఉంటున్నాయి. వీఆర్వోలు, సర్వేయర్లు ఫీల్డ్ వర్క్ పేరుతో ఎప్పుడు కార్యాలయంలో ఉండరని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- పెద్దవడుగూరులోని సచివాలయంలో రెండు పోస్టులు ఖాళీగా ఉండగా ఇద్దరు సెలవుపై వెళ్లారు. ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు.
- పెద్దపప్పూరు మండలంలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లకే ఎక్కువగా పనులు ఉన్నాయి. మహిళా పోలీసులకు పని భారం లేదు.
- యల్లనూరులోని సచివాలయంలో ఉదయం 10 గంటలకు డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, విద్యుత్‌లైన్‌మెన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కార్యాలయాలకు రాలేదు.

సర్వేలతో సతమతం

- సచివాలయ ఉద్యోగులకు సర్వే తలపోటు తెప్పిస్తోంది. జియోట్యాగ్, ఈ-కేవైసీ, మిస్సింగ్ చైల్డ్, వాట్సప్ డోర్ టు డోర్, పీ-4, వర్క్‌ఫ్రం హోం, ఆధార్ సీడింగ్, కౌశలం, ఆర్‌సీహెచ్, యూ-విన్, ఏఎంటీ, ఎన్‌సీడీసీడీ, ఎన్ఎంఈపీ ఇమ్యూనైజేషన్ ఇలా 19 నుంచి 42 వరకూ సర్వేలు చేయాల్సి వస్తోంది. వీటి కోసం ఇంటింటికి తిరుగుతున్నారు. ఓటీపీలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తలకు మించిన భారంగా మారింది. రెగ్యులర్ విధులకు అదనంగా సర్వే పనులు చేయాల్సి వస్తోంది.
- రీ గ్రూపింగ్‌తో సచివాలయ ఉద్యోగులను మల్టీపర్పస్, టెక్నికల్ విభాగాలు వేరు చేశారు. మల్టీపర్పస్ కింద అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్, వీఆర్ఓలు కార్యాలయంలోనే ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలి. టెక్నికల్ క్యాటగిరీ కింద శానిటేషన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, ఏఎన్ఎం, ఎనర్జీ అసిస్టెంట్‌లను చేర్చారు. వీరు క్షేత్రస్థాయి విధులకు వెళ్లాలి. విజన్ యూనిట్ అమలుతో ప్రయోజనం ఉంటుందని సచివాలయ ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

పాడైపోయిన కంప్యూటర్లు

చాలా సచివాలయాలలో కంప్యూటర్లు, ప్రింటర్లు చెడిపోయాయి. వాటి మరమ్మతులకు సాంకేతిక సాయం కూడా అందడం లేదు. స్టేషనరీ కూడా సకాలంలో అందడం లేదు. వార్డు సచివాలయాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రికార్డుల కోసం కొందరు సచివాలయ ఉద్యోగులు చేతి నుంచి రూ.1500 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పౌరసేవలు బాగానే అందుతున్నాయని నగర ప్రజలు అంటున్నారు.


శింగనమల సచివాలయంలో ఉదయం 10.30 సమయంలో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

పది పరీక్షల ఫీజు చెల్లించండి

అనంతపురం విద్య, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి 2025-26 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, పరీక్షల విభాగాధిపతి (ఏసీ) వెంకటేశులు బుధవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 23వ తేదీ వరకు రెగ్యులర్, ఓపెన్ టెన్త్, ఒకేషనల్ రెగ్యులర్ అభ్యర్థులు, పరీక్ష తప్పిన వారు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలన్నారు. ఫెయిలైన వారు 3కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, అంతకన్నా తక్కువ ఉంటే రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 3 వరకు, రూ.200తో 10 వరకు, రూ.500తో 15వ తేదీ వరకు రెగ్యులర్ ఫీజుతో కలిసి చెల్లించాల్సి ఉంటుందన్నారు. యూడైస్ పోర్టల్‌లో విద్యార్థి వివరాలు ధృవీకరించిన తర్వాత వెబ్‌సైట్‌లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందని ప్రధానోపాధ్యాయులకు డీఈఓ, ఏసీ తెలిపారు.

యువతలో సామాజిక బాధ్యత పెరగాలి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- అట్టహాసంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు


యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ


యువతుల కోలాటం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువజనోత్సవాలు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జ్యోతి వెలిగించి, యువజనోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువత నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకుని.. సాధన చేయాలన్నారు. జానపద నృత్యంలో అజయ్‌కుమార్, జానపద గేయంలో సాయిపల్లవి, డిక్లమేషన్‌లో దీపశ్రీ, చిత్రలేఖనంలో సాయిప్రమీద, కవితల పోటీలో వెంకటసాయి, కథల పోటీలో తేజస్విని, సైన్సు మేళాలో అభిషేక్ విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి రవిశంకర్ రెడ్డి తెలిపారు. అనంతరం విజేతలకు మొమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సహదేవుడు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బీసాటి జీవన్‌కుమార్, జయమారుతి పాల్గొన్నారు.


ప్రపంచ కప్ నెగ్గిన భారత మహిళా క్రికెట్ జట్టుతో క్రాంతి

క్రాంతి పథం !

భారత మహిళా క్రికెట్ జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్‌గా గుంతకల్లు యువకుడు

వరల్డ్‌కప్ గెలవడంలో ఇతోధిక పాత్ర

బీసీసీఐలో అంచెలంచెలుగా ఎదుగుతున్న క్రాంతికుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు విశ్వవిజేతగా అవతరించడంలో అనంతపురం జిల్లా యువకుడి పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. గుంతకల్లుకు చెందిన క్రాంతికుమార్ భారత మహిళా క్రికెట్ జట్టుకు ట్రైనింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గుంతకల్లు రైల్వే విశ్రాంత ఉద్యోగి జి. వెంకటరమణ, జయమ్మ దంపతుల కుమారుడు క్రాంతికుమార్ 11 ఏళ్ల కిందట క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా ఎంచుకుని అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. క్రాంతికుమార్ 2010లో గుంతకల్లు రైల్వే హైస్కూల్‌లో పదోతరగతి పూర్తి చేశాడు. 2014లో గుత్తి గేట్స్ కాలేజీ బీటెక్‌లో ఈసీఈ చదివాడు. తర్వాత కొన్నాళ్లు ఆర్డీటీలో క్రికెట్‌లో శిక్షణ పొందాడు. 2015లో క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా తీసుకుని ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ బీసీసీఐలో చేరాడు. మొదటి భారత మహిళా క్రికెట్ జట్టుకు అసిస్టెంట్‌గా చేరాడు. ఆ తరువాత ట్రైనింగ్ అసిస్టెంట్, ఫిట్‌నెస్, ఫిజియోథెరపిస్టుగా పనిచేశాడు.

ఐపీఎల్‌లో సైతం

గత ఐదేళ్ల నుంచి భారత మహిళా జట్టుకు సంబంధించి స్టాఫ్ మెంబర్‌గా క్రాంతికుమార్ సేవలందిస్తున్నాడు. 2022లో ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు సపోర్ట్ స్టాఫ్ మెంబర్‌గా పనిచేశాడు. మూడేళ్ల కిందట జరిగిన ఆసియా గేమ్స్, 2022లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత జట్టుకు సపోర్ట్ స్టాఫ్ సభ్యుడిగా పని చేశాడు. 2025 మహిళా వరల్డ్‌కప్ విజేత జట్టులో సభ్యుడిగా క్రాంతికుమార్ ఉండడం విశేషం.

ఈ స్థాయిని ఊహించలేదు

క్రికెట్ అంటే చిన్నప్పటి నుంచి పిచ్చి. అదే నన్ను ఈ స్థాయికి చేర్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో నా క్రికెట్ ప్రయాణం సాఫీగానే సాగింది. తొలుత ఫ్యాషన్‌గానే క్రికెట్‌ను ఎంచుకున్నా తరువాత ఎలాగైనా సరే మంచి స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లా. 11ఏళ్లుగా క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా ఎంచుకుని సాగుతున్నా. ఇటీవల ముగిసిన మహిళా వరల్డ్‌కప్‌లో లీగ్ మ్యాచ్ నుంచి ఫైనల్ వరకు...ప్రతి మ్యాచ్‌ని ఫైనల్‌గా భావించాం. కప్ సాధిస్తామనే విశ్వాసం జట్టులోని ప్రతి ఒక్కరికి ఉంది. అదే భారత జట్టును విశ్వవిజేతగా నిలిపింది.

-క్రాంతికుమార్,
భారత మహిళా క్రికెట్ జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్


భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో క్రాంతికుమార్

అప్పుల ఉరికి కూలీ బలి

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్(28) అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... ప్రవీణ్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ భార్య కుమారుడిని పోషించుకునేవాడు. కుటుంబ పోషణ కోసం బయట వ్యక్తులతో అప్పులు చేశాడు. అయితే తగినంత ఆదాయం లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలంటూ తరచూ మదనపడేవాడు. మృతుడి తండ్రి దేవరకొండ నారాయణస్వామి మాత్రం కష్టపడి పని చేసి అప్పులు తీర్చుదామని ధైర్యం చెప్పేవాడు. కాగా 9 నెలల గర్భవతి అయిన భార్యను, ఏడేళ్ల కుమారుడిని మంగళవారం ఆమె పుట్టినిల్లు అయిన అనంతపురంలో వదిలి ప్రవీణ్‌కుమార్ తిరిగి ధర్మవరం వచ్చాడు. పట్టణంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రవీణ్‌కుమార్ తండ్రి బుధవారం ఇంటికి వచ్చాడు. వాకిలి వద్ద నిలబడి ఎంత పిలిచినా ప్రవీణ్ కుమార్ పలకకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి ఇంటిలోకి వెళ్లాడు. అక్కడ ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి బోరు మంటూ విలపించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

బంగారం నెక్లెస్ చోరీ

యాడికి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో 2.5తులాల బంగారం నెక్లెస్ చోరీ అయినట్లు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోలు దొడ్డి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 8న వెంకటలక్ష్మి 2.5తులాల బంగారు నెక్లెస్‌ను బ్యాగులో పెట్టుకొని అనంతపురం జిల్లా గుత్తి నుంచి బస్సులో రాయలచెరువుకు బయల్దేరారు. జక్కులచెరువు గ్రామ సమీపాన బ్యాగును పరిశీలించగా అది కట్టిరించినట్లు గుర్తించారు. అందులో పెట్టిన బంగారు నెక్లెస్ కూడా కనిపించలేదు. తాండపాడు వద్ద గుర్తుతెలియని మహిళలు బస్సులో నుంచి వేగంగా దిగి వెళ్లిపోయినట్లు తెలిపారు. వారిపై అనుమానం ఉన్నట్లు వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో బుధవారం కుటుంబ కలహాలతో భార్య గొంతు కోశాడు ఓ భర్త. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోరంపల్లికి చెందిన దంపతులు రత్నమ్మ, ఎర్రిస్వామి బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సమస్యలతో వాగ్వాదానికి దిగారు. ఎర్రిస్వామి ఆవేశానికి లోనై ఇంట్లో ఉన్న చాకు తీసుకుని రత్నమ్మపై దాడి చేశాడు. ఆమె గొంతు కోయడంతో కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. అప్పటికే రత్నమ్మ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతోంది. 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎర్రిస్వామి పరారయ్యాడు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కుమార్తె చనిపోయిన మూడు రోజులకే కన్నుమూత

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కంబదూరులోని ఆర్టీసీ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు గంగమ్మ (102) బుధవారం మృతి చెందారు. చిన్న కుమారుడు గంగాధర వద్ద గంగమ్మ ఉండేవారు. వయోభారంతో కన్నుమూశారు. గంగమ్మ మృతదేహానికి స్వగ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ముగ్గురు కుమారులు నారాయణప్ప, నాగరాజు, గంగాధర, కుమార్తె నారాయణమ్మ ఉన్నారు. ఐదువరకే పెద్ద కుమారుడు మరణించారు. మూడు రోజుల క్రితం కుమార్తె కూడా కన్నుమూశారు. బుధవారం గంగమ్మ చనిపోవడం పట్ల కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.


గంగమ్మ (ఫైల్)

మరో 15 పీజీ సీట్లు

వైద్య కళాశాలలో సంబరాలు


ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న విభాగాధిపతులు


అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలకు మరో 15 పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయశ్రీ తెలిపారు. పీడియాట్రిక్స్, గైనిక్, అనస్తీషియా విభాగాలకు నాలుగు చొప్పున, ఆర్థినెస్త్రేషన్‌కు మూడు సీట్లు మంజూరయ్యాయన్నారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 136కి చేరిందన్నారు. బుధవారం విభాగాధిపతులు మస్తాన్‌బేగం, రవికుమార్, నవీన్‌కుమార్, శౌరి, ఎన్ఎంసీ కమిటీ సభ్యులు ప్రవీణ్ డీన్, ప్రవీణ, శ్రావణి తదితరులు ప్రిన్సిపాల్ విజయశ్రీ, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియాను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాగిఫలకపై విజయనగర శాసనాలు

● శ్రీకాళహస్తిలో లభ్యం



శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో విజయనగర కాలం నాటి రాగిఫలక శాసనాలు వెలుగుచూశాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురాము ఇంట ఇవి తరాలుగా ఉన్నాయి. కార్తీక మాసం సందర్భంగా వీటిని బయటకు తీసి శుద్ధి చేస్తుండగా, వీరి కుటుంబ పురోహితుడు సింగరాజు మణి ఫోటోలు తీసి, వాటిని మైసూరులోని భారత పురావస్తు శాఖ శాసన విభాగం డైరెక్టర్ మునిరత్నం రెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి ఇవి క్రీ.శ. 1576లో విజయనగరరాజు శ్రీరంగ రాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం కొన్ని గ్రామాలను దానంగా ఇచ్చిన శాసనాలని నిర్ధారించారు. సంస్కృత భాషలో నందినాగరి లిపిలో రాగి రేకుల మీద వీటిని చెక్కి ఉన్నారు. వీటిని స్వయంగా పరిశీలించడం కోసం మునిరత్నం రెడ్డి శ్రీకాళహస్తికి రానున్నారు. నాలుగు రాగి పలకలు వీరి వద్ద ఉన్నాయి.


రాగి శాసనాలను చూపుతున్న సింగరాజు మణి
విజయనగరం కాలం నాటి రాజముద్ర

జాతీయస్థాయి పోటీలకు సుస్మిత



కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలో స్పోర్ట్స్ మహారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని హనకనహళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుస్మిత ప్రతిభచాటింది. త్వరలోనే రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు హెచ్ఎం వేణుగోపాల్, పీఈటీ సరిత బుధవారం తెలిపారు.

ఇంట్లోవాళ్లకు కోటి..!

పశుసంవర్ధక శాఖలో నిధుల స్వాహా..!

- కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించిన మునుపటి జేడీ
- వెలుగుచూసిన అక్రమం
- ప్రభుత్వ సొమ్మును భద్రంగా ఉంచాలనే మళ్లించినట్లు బుకాయింపు?
- రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి వ్యవహారం
- నేడో.. రేపో.. రాష్ట్ర ఆడిట్ బృందం రాక

పశుసంవర్ధక శాఖలో గతంలో పనిచేసిన ఏకంగా రూ.కోటికిపైగా స్వాహా చేసినట్లు సమాచారం. అది కూడా కుటుంబికుల ఖాతాలకు జమ చేసినట్లు తెలుస్తోంది. వ్యవహారం ప్రస్తుతం బయటకు పొక్కడంతో ఆ అధికారి కట్టుకథ చెబుతున్నారట. అబ్బే.. తాను నిధులు కొట్టేసే ఉద్దేశంతో మళ్లించలేదనీ, ప్రభుత్వ ఖాతాలో ఉంటే భద్రత ఉండదనీ.. కుటుంబికుల ఖాతాలకు జమ చేశానంటూ బుకాయిస్తున్నాడు. పాపం.. ప్రభుత్వ సొమ్ముపై ఎంత జాగ్రత్తో కదా..

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో భారీగా నిధుల స్వాహా జరిగింది. అది నుంచీ వివాదాస్పద అధికారిగా పేరొందిన గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం. వివిధ పథకాలకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఖాతాల్లోని సొమ్మును కొందరు సిబ్బందితో కుమ్మక్కై కాజేసినట్లు సమాచారం. ఇందులో ఎక్కువ మొత్తంలో జేడీస్థాయి అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించినట్లు సమాచారం. నిధుల స్వాహా విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నించారు. విషయం బయటకు పొక్కిన నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ బుధవారం తన చాంబర్‌లో కార్యాలయ అధికారులు, సిబ్బందితో అత్యవసరంగా సమావేశమయ్యారు. నిధుల స్వాహాపై కూడా చర్చించినట్లు సమాచారం.

రూ.కోటికిపైగా స్వాహా

జిల్లా పశుసంవర్ధక శాఖకు సంబంధించిన నిధులను పలు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు ఖాతాల్లో మిగిలిపోయినట్లు సమాచారం. ఈ సొమ్ముపై వచ్చే వడ్డీని పలు అత్యవసర పనులకు వాడుకునే వెసులుబాటు ఉండేది. గతంలో ఇక్కడ జేడీగా పని చేసిన ఓ అధికారి డిపార్ట్‌మెంట్ ఖాతాలోని నిధులపై కన్నేసినట్లు సమాచారం. ఆయన ఉద్యోగ విరమణ పొందిన తరుణంలో డిపార్ట్‌మెంట్ ఖాతాలోని సొమ్మును తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి రూ.కోటికిపైగా మళ్లించినట్లు సమాచారం. డిపార్ట్‌మెంట్ ఖాతాలోని సొమ్మును వాడుకునే సమయంలో ఏ పనికి ఖర్చు చేస్తున్నారు..? తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఆయేమీ లేకుండానే భారీగా సొమ్మును ఆ అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి జమచేసినట్లు తెలుస్తోంది. సదరు జేడీ పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, మరికొందరు సిబ్బంది సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు కాజేసిన విషయం బయటపడే అవకాశం ఉందని గ్రహించిన సదరు సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశం తేలాల్సి ఉంది.


సిబ్బందితో సమావేశమైన జేడీ ప్రేమ్‌చంద్

కలకలం..

రూ.కోటికిపైగా నిధులు స్వాహా చేశారన్న సమాచారంతో పశుసంవర్ధక శాఖలో కలకలం రేగింది. ఎవరెవరి ఖాతాలకు సొమ్ము జమ చేశారు..? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందన్న దానిపై అధికారులు ఆరాతీశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీనే నిధుల స్వాహాకు పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సొమ్ము స్వాహా విషయం బయటకు పొక్కిన సమాచారం జేడీకి అనుకూలురైన సిబ్బంది చేరవేసినట్లు తెలిసింది. దీంతో సంస్థ డబ్బు ఎవరైనా కాజేస్తారన్న ఉద్దేశంతోనే కుటుంబ సభ్యుల ఖాతాల్లో భద్రంగా ఉంచానని.. ఇందులో తన తప్పేమీలేదని ఆ అధికారి బుకాయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడో.. రేపో.. ఆడిట్ బృందం రాక

నిధుల స్వాహాపై బ్యాంకు వివరాలతో సహా ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు పశుసంవర్ధక శాఖ అధికారులు నివేదించినట్లు సమాచారం. కలెక్టర్ ఆనంద్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులతో నిధుల స్వాహాపై ఆరాతీశారు. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర ఆడిట్ బృందం జిల్లాకు రానున్నట్లు సమాచారం. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేసి, రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఆ శాఖలో తీవ్ర చర్చ సాగుతోంది.

హామీలు విస్మరించడం అన్యాయం

విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య
అనంతలో ముగిసిన ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర

అనంతపురం విద్య, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక, విస్మరించడం అన్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ముగింపు సభ బుధవారం అనంతలో నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ బాలికల కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. పాలకులు సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని వ్యాపారంగా మారుస్తూ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెడుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ 'పేదోళ్ల విద్యారంగ సమస్యలు తెలియవా' అని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ చేపట్టే ఉద్యమాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు జగదీష్, జాఫర్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుట్ట లక్ష్మణ, రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, అల్లీపీర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు చలపతి, మస్తాన్, పణీంద్ర, నాగభూషణం, రవికుమార్, సాయి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

పనిచేసిన కంపెనీలకే కన్నం

కాపర్ వైరు అపహరణ కేసుల ఛేదింపు
నలుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న కాపర్ వైరును చూపుతున్న డీఎస్పీ

నంబులపూలకుంట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోలార్ కంపెనీల్లో గతంలో పనిచేసిన వారే కాపర్ వైరు అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కాపర్ వైరు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. నలుగురిని అరెస్టు చేసి, రూ.32లక్షల విలువ చేసే కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా.. ఒకరు ఆస్పత్రిలో ఉన్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఆయన వెల్లడించారు. నంబులపూలకుంటకు చెందిన అలీ, బాబావలీ, బాబాజాన్, బాలాజీ, ఆవుల శివ, రవి, మండల కేంద్రం సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లికి చెందిన పెద్దముబారక్, చిన్నముబారక్ ముఠాగా ఏర్పడ్డారు. సోలార్ ప్లాంట్‌లో పలు సంస్థలకు చెందిన కాపర్ వైరును పలుమార్లు అపహరించారు. దానిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. చోరీలపై ఆయా సంస్థల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గత ఆరు నెలల్లో ఆరు కేసులు నమోదయ్యాయి. రూ.32లక్షల విలువైన 62వేల మీటర్ల కాపర్ వైరును అపహరించారు. ఈ చోరీలను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సీఐ నాగేంద్ర, ఎస్ఐ వలీబాషా, కానిస్టేబుల్ నారాయణస్వామి బృందంగా ఏర్పడి గాలిస్తున్నారు. అయానా సోలార్ కంపెనీ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద కాపర్ వైరును అపహరిస్తుండగా.. పెద్ద ముబారక్, చిన్న ముబారక్, అలీ, బాబావలీ, బాబాజాన్‌ను పట్టుకున్నారు. బాలాజీ, ఆవుల శివ పరారీలో ఉండగా.. రవి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులంతా గతంలో సోలార్ కంపెనీల్లో గ్రాస్ కట్టింగ్ (గడ్డికోత), వెల్డర్, టెక్నీషియన్, వెల్డింగ్ పనులు చేసినవారేనన్నారు.

బిడ్డను చూడకుండానే..

తండ్రి కన్నుమూత

ఆస్పత్రిలో కుమార్తె జననం
చూసేందుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం

బత్తలపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో బిడ్డ జన్మించిందని తెలియగానే ఆనందంగా చూడడానికి బయల్దేరిన తండ్రి మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డాడు. బిడ్డను చూడకుండానే కన్నుమూశాడు. మండలకేంద్రంలోని వైజంక్షన్‌లో బుధవారం రాత్రి బైక్ బోల్తాపడి ధర్మవరానికి చెందిన దిలీప్‌కుమార్ (25) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నాగేంద్ర కుమారుడు దిలీప్‌కుమార్ పట్టు చీరలకు సంబంధించి రేషం వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడికి భార్య లాస్య, కుమార్తె ఉన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో భార్య లాస్య బుధవారం ప్రసవించింది. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. బిడ్డను చూసేందుకు దిలీప్ కుమార్ ఆనందంగా బయల్దేరాడు. ధర్మవరం నుంచి బైక్‌పై బయల్దేరాడు. బత్తలపల్లి దాటగానే వైజంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,500కి అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రామమోహన్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 19టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.13తో, సరాసరిగా రూ.23తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు


కోర్టు వద్ద ప్రకాశ్ నాయుడు, నటుడు రాజకుమార్‌కు స్థానిక నాయకుల సత్కారం

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నమోదైన కేసు విషయంగా పట్టణ కోర్టుకు టీడీపీ నాయకులు బుధవారం హాజరయ్యారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 2009 ఏప్రిల్‌లో గుత్తి పట్టణంలో సినీ నటుడు రాజకుమార్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ నాయకులు కృష్ణ, గాజుల ఆదెన్న ప్రచారం నిర్వహించారు. ఈక్రమంలో నిబంధనలు అతిక్రమించారని అప్పట్లో వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో వారు కోర్టుకు హాజరయ్యారు. వారి వెంట ఏజీపీ వక్షబాషా, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

వార్డెన్ల జేఏసీ ఏర్పాటు

అనంతపురం విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖల వార్డెన్ల సంఘాన్ని పదేళ్ల తరువాత పునరుద్ధరించారు. జిల్లా జేఏసీని ఏర్పాటు చేశారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల వార్డెన్లు బుధవారం సమావేశమయ్యారు. తమ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామునాయక్, ప్రధానకార్యదర్శిగా మారుతీప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మస్తాన్, ఉపాధ్యక్షులుగా రాజశేఖరనాయుడు, నాగమణి, రామాంజనేయరెడ్డి, బయపరెడ్డి, గురుప్రసాద్, ఆశ్వత్థ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖరాలును, సంయుక్త కార్యదర్శులుగా సాహెజ, జగన్నాథ్, నాగరాజు, గోవిందరెడ్డి, ఈరన్న, ఆదినారాయణ, బాలు, సూర్యాంజనేయులను ఎన్నుకున్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఒకటి చొప్పున సోషల్ కౌన్సిలర్, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్, రెండు సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ మొత్తం నాలుగు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువతి అదృశ్యం

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మాజీపేట గ్రామానికి చెందిన ఓ యువతి ఈనెల 8 నుంచి కనిపించడం లేదు. బంధువులు, కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆ యువతి తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేతన కమిషన్‌ను నియమించాలి

రైల్వే గార్డుల డిమాండ్: డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా


డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైల్వే గార్డులు

గుంతకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 8వ వేతన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత రైల్వే గార్డుల కౌన్సిల్ (ఏఐజీసీ) నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే గార్డుల సమస్యలపై బుధవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఏఐజీసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంఘం డివిజనల్ కార్యదర్శి పీవీ సింగ్ మాట్లాడారు.. రైలు మేనేజర్లకు వేతన స్థాయిలను నిర్ధారించాలని, 2024 జనవరి 1వ తేదీ నుంచి రన్నింగ్ అలవెన్సును 25 శాతానికి పెంచాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైలు గార్డులు పాల్గొన్నారు.

జంబుద్వీప చక్రాన్ని పరిశీలించిన జేసీ


వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివనారాయణశర్మ

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొనకొండ్ల సమీపంలో ఉన్న జంబుద్వీప చక్రాన్ని జేసీ శివనారాయణశర్మ బుధవారం పరిశీలించారు. కొనకొండ్ల వద్ద ఆర్కియాలజీకి సంబంధించి ప్రతిపాదించిన ఆదనపు భూమి కోసం కొండ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పురావస్తు శాఖకు 25ఎకరాలు కేటాయించగా, రోడ్డ నిర్మాణం కోసం 2.6 ఎకరాల స్థలం అదనంగా అవసరమైంది. అందుకు సంబంధించిన రికార్డుల వివరాలను జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఆర్కియాలజీ ఏడీ స్వామి నాయక్, వీఆర్వోలు, శ్రీతనాయక్, నవ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి: సీఈఓ



కునుకుంట్లలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శివశంకర్

తాడిమర్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈఓ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కునుకుంట్ల గ్రామంలో ఆయన పర్యటించారు. ఉదయం 6 గంటలకే గ్రామానికి చేరుకుని పారిశుధ్య పనులపై ఆరాతీశారు. రోడ్డుకు ఇరువైపులా దిబ్బలు వేయడం మానుకోవాలని సూచించారు. వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, కార్యదర్శి వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎంపిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎస్టీయూ నాయకులు

నంబులపూలకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా గంగాధర్‌యాదవ్, అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా తిరుమలప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చరణ్, మహిళా కన్వీనర్‌గా శ్రీదేవి, మైనార్టీ కన్వీనర్‌గా బాబ్‌జాన్, జీపీఎస్ కన్వీనర్‌గా యోగేంద్రను ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన వారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పర్వతరెడ్డి, మాధవాచారి, శ్రీనివాసులరెడ్డి, పూర్ణానందరెడ్డి, పురుషోత్తమరెడ్డి, రామ్మోహన్, రెడ్డెప్ప, హబీబుల్లా, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరుల పరిశీలన



మ్యాప్ ద్వారా వివరాలను తెలియజేస్తున్న గ్రామస్థులు

తనకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి, మార్పురివాండ్లపల్లి గ్రామాలను ఒడిషా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వాసన్ సంస్థ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. పెద్దపల్లిలో గ్రామస్థులతో కలిసి సహజ వనరులు, పంటలు తదితర వివరాలను పీఆర్‌ఏ మ్యాప్‌ద్వారా గ్రామస్థులు వివరించారు. వివిధ విషయాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మార్పురివాండ్లపల్లిలో ఏడాది పొడవునా సీజనల్ వారిగా సాగుచేస్తున్న పంటలు, వివరాలు, ఖర్చులు, తదితర వివరాలను గ్రామస్థులు వివరించారు. గ్రామాలను పరిశీలించి పలు విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాసన్ ప్రతినిధులు ఉత్తప్ప, శ్రీనాథ్‌రెడ్డి, నరేంద్ర, శంకర్, కొండారెడ్డి, జనజాగృతి సిబ్బంది చంద్రమోహన్, విశ్వనాథ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుసుం పట్టికలను ప్రదర్శించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

నంబులపూలకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మీ సేవా కేంద్రంలో దరఖాస్తులకు ప్రజలు చెల్లించాల్సిన రుసుం పట్టికను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మసీదు కాంప్లెక్సు మీసేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మీసేవలో ఏ దరఖాస్తుకు ఎంత చెల్లించాలి అనేది ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలని తెలిపారు. రుసుం పట్టికను మూడురోజులలోపు ఏర్పాటు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

రెక్కమానులో నేడు వైద్యశిబిరం

గాండ్లపెంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు సర్పంచ్ సుధాకర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్ట్ హెల్త్ స్కీం ద్వారా అర్హులైన వారందరికీ ఉచితంగా కిడ్నీ సంబంధిత బాధితులకు ఉచిత డయాలసిస్ చేస్తామని తెలిపారు. పలు రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్‌లు, వైద్య సేవలు అందిస్తామని వివరించారు. వైద్య సేవలు వచ్చు వారు ఆధార్‌కార్డు తీసుకునిరావాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

గాండ్లపెంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ బుధవారం తెలిపారు. ఆదివారం కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన 39వ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలలో గాండ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవిత్ర, హర్షిత, యశ్విని, జోయ ఫిర్దోస్ ఎంపికయ్యారని తెలిపారు. డిసెంబర్ 1, 2 తేదీలలో నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు హరిప్రసాద్, నాగేశమ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథరెడ్డి, పీటీఎం మురాద్‌షా, ముంతాజ్, ఓబుళరెడ్డి, తాహెర్‌వలీ పాల్గొని విద్యార్థులను అభినందించారు.



సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

ఆదమరిస్తే అంతే సంగతులు..!

- రోడ్డు పక్కనే బావి
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కన బావి చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు

నల్లమాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే పెద్దబావి ఉంది. ఆ బావి చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. నిత్యం ఆ రహదారిలో వాహన సంచారం ఉంటుంది. ఏమాత్రం ఏమరుపాటుతో వాహనదారులు వ్యవహరించినా పెద్ద ప్రమాదంలో చిక్కుకోవాల్సిందే. అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. మండల పరిధిలోని చౌటకుంటపల్లికి అనుకుని ఓ పెద్ద నీటి బావి ఉంది. ఆ బావిలో నీరు లేవు. ఈ బావి సుమారు 30 అడుగుల లోతు ఉంటుంది. ఇదే రహదారిలోనే కంసలవాండ్ల బావి ఉంది. ఈ బావికి కూడా ఇదే పరిస్థితి ఉంది. బావుల చుట్టూ చెట్లు ఏపుగా పెరిగాయి. ఈ బావుల పక్కనే చౌటకుంటపల్లి నుంచి కదిరికి వెళ్లే రహదారి ఉంది. ఈదారి గుండా నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలు, లారీలు, తిరుగుతుంటాయి. బావికి రోడ్డు వద్ద ప్రహరీ లేదు. ఆదమరిస్తే బావిలోకి పడిపోతారని, ఈ బావులకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లోనే ఈ బావులకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామానికి సమీపంలో బావులు ఉండడంతో పిల్లలు కూడా ఆడుకుంటూ ఆటువైపు వెళ్తుంటారని, ప్రమాదవశాత్తు పడితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బావి వద్ద ప్రహరీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం: మంత్రి



విద్యార్థులను శిక్షణకు పంపుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించేలా కృషిచేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ ఏ డాది సెప్టెంబరు 16వతేదీ సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ సహకారంతో ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ అర్హత పరీక్ష నిర్వహించారు. ఇందులో 120 మంది విద్యార్థులు హాజరు కాగా.. 12 మంది విద్యార్థులను ఉచిత శిక్షణకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేక బస్సులో శిక్షణ కోసం బుధవారం ఎన్డీఏ కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి పంపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందే స్థాయికి ఎదగ డం మన అందరి బాధ్యత అన్నారు. సంస్కృతిసేవాసమితి తరఫున రూ.1,83,600 చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసరెడ్డి, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం: ఎమ్మెల్యే



ఇళ్ల మంజూరు పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇంటిపట్టాతోపాటు ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. పేదల సొంతింటి కళ నేరవేరుస్తామని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. ప్రతి పథకాన్ని మహిళల పేర్లతోనే అందచేస్తోందని అన్నారు. ఇదే గ్రామంలో 2004-09 సంవత్సరం మధ్యలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో పక్కా గృహాల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని గుర్తుచేశారు. ఆ కారణంగా ఎంతోమందికి ఇళ్లు రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. అక్రమాలు చేసిన వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కుటాగుళ్లలో పట్టాలిచ్చి, స్థలం చూపని వారందరికి త్వరలో స్థలాలు చూపించి, ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పేదల పేరుతో అక్రమాలు చేసినవారిని దూరం పెట్టాలని సూచించారు. అనంతరం సబ్సిడీ ధరలతో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీనాబాను, చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ చైర్మన్ రాజశేఖరాచారి, కౌన్సిలర్ గంగాభవాని, టీడీపీ నాయకులు బాహద్దీన్, గంగరాజు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్ మురళీ, ఏడీఏ సనావుల్లా పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం అందకుండా కుట్రలు



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి, నాయకులు

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలకు విద్య వైద్యం అందకుండా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ప్రధాన కూడళ్ల మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 12 మెడికల్ కాలేజ్‌లు మాత్రమే ఉండేవన్నారు. జగనన్న ప్రభుత్వంలో మూడేళ్లలో 17 మెడికల్ కాలేజ్‌లను నిర్మించేలా చర్యలు చేపట్టి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పీపీపీ విధానంలో అతి తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడం ద్వారా పేదలకు సాయం అందే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నార్పల సత్యనారాయణరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు నిధులు కేటాయించండి



డిప్యూటీ ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఆర్యవైశ్యులు

తనకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లికి చెందిన సర్వేనెంబర్ 174లో 50 సెంట్లు భూమిని ఆర్యవైశ్యుల శ్మశానటిక కోసం అధికారులు కేటాయించారు. ఈ శ్మశానవాటికలో మౌళిక వసతుల కోసం నిధులు కేటాయించాలని బుధవారం డిప్యూటీ ఎంపీడీఓ మురళీశ్రీనివాసులుకు బొంతపల్లి, చీకటిమానుపల్లి, అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు చెందిన ఆర్యవైశ్యులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకుడు పారేసు, ఆర్యవైశ్యులు సురేంద్ర గుప్తా, సుదర్శన్‌శెట్టి, అశ్వర్థనారాయణ, చలమయ్యశెట్టి, రామనాథం, ఉదయ్‌కుమార్, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం

తనకల్లు మండలంలోని బొంతపల్లి, చీకటిమానుపల్లి, అన్నమయ్యజిల్లాలోని మొలకలచెరువు గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు బుధవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన నివాసంలో సన్మానించారు. శ్మశానవాటిక కోసం 50 సెంట్లు భూమిని కేటాయించినందుకు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్వోల మండల కమిటీ ఎన్నిక



వీఆర్వోల మండల నూతన కమిటీని అభినందిస్తున్న అధికారులు

కదిరిఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా కుష్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్‌ఆర్బాస్, కోశాధికారిగా మోహన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా అరవింద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా మొహిద్దీన్ బాషా



తనకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా మల్లిరెడ్డిపల్లి వీఆర్వో ఎస్. మొహిద్దీన్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో వీఆర్వోల సంఘం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పాల గంగాధర్, కార్యదర్శిగా రఘునాథ్‌రావు, కోశాధికారిగా సుకు సాయివర్ధన్, సంయుక్త కార్యదర్శిగా చాంద్‌బాషాను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు మొహిద్దీన్‌బాషా తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన ధర్మవరం ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్‌శాఖ ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతిషాపులో స్కాన్‌చేసి అమ్మకాలు జరిగే విధంగా చూడాలన్నారు. తరచూ బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బెల్టుషాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ చంద్రమణి, ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలను పరిష్కరించండి



రీసర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ కూర్మనాథ్

తాడిమర్రి/బత్తలపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రీసర్వే వల్ల వస్తున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర సెటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం తాడిమర్రి మండలంలోని పెద్దకోట్ల, బత్తలపల్లి మండల పరిధిలోని ముస్టూరు గ్రామాల్లో ల్యాండ్ రీసర్వే పనులను ఆయన పరిశీలించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడారు. పాత రికార్డులు సరిగా లేకపోవడం, పాత హద్దులు సరిగా నమోదు చేయకపోవడం వల్ల వస్తున్న సమస్యలు రీసర్వే ద్వారా పరిష్కారమవుతాయన్నారు. ఇంకా జాయింట్ ఎల్‌పీ నెంబర్ల వల్ల రాబోవు కాలంలో వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకుని వాటిని సింగిల్ ఎల్‌పీ నెంబర్లుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సత్యసాయి, అనంతపురం జిల్లాల సర్వే అధికారులు విజయశాంతి, రుప్లానాయక్, ధర్మవరం డిప్యూటి ఇన్‌స్పెక్టర్లు శామ్యూల్‌బాబు, మురళీకృష్ణ, అంజలిదేవి, తహసీల్దార్లు భాస్కర్‌రెడ్డి, స్వర్ణలత, సర్వేయర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



జనసేన పార్టీలోకి చేరిన మహిళా సంఘాల సభ్యులు

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తపేట, శాంతినగర్‌కు చెందిన డ్వాక్రా మహిళలు బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరికి పార్టీ కండువా వేసి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనసేన పార్టీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందని, పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కోసం తాను నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎరికి ఏ ఆపద వచ్చినా పరిష్కరించడానికి కృషి చేస్తాన అన్నారు. కార్యక్రమంలో నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

విత్తన శుద్ధి పాటించాలి



తిరుమలదేవరపల్లిలో విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కొత్తచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ప్రతి రైతు విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామూనాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తిరుమలదేవరపల్లిలో కేశవరెడ్డి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామూనాయక్ పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. బావులు, బోర్ల కింద వేరుశనగ, మొక్కజొన్న, ఇతర పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీశ్‌బాబు, ఏఈఓ సునీత పాల్గొన్నారు.

- ధర్మవరం రూరల్: వేరుశనగ సాగుచేసిన రైతులు ఎకరాకు 200 కిలోల జిప్సంను చల్లుకుంటే కాయలు నాణ్యత దిగుబడి వస్తున్నాయని ఏఓ ముస్తఫా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వసంతపురం గ్రామ పొలాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో స్వర్ణ పతకాలు



స్వర్ణ పతకాలను చూపుతున్న విద్యార్థులు

ధర్మవరం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడోపోటీల్లో మండలంలోని చిగిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలు సాధించినట్లు పీడీ ప్రతాప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కాకినాడలో ఈనెల 6నుంచి 10వతేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో జరిగిన పోటీలలో చిగిచెర్ల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొని విజయం సాధించి స్వర్ణపతకాలు సాధించారని తెలిపారు. బాలుర కేటగిరీలో 45 కిలోల విభాగంలో యశ్వంత్, 50 కిలోలవిభాగంలో విక్రాంత్, బాలికల విభాగంలో 36కిలోల విభాగంలో నందిని, 48కిలోల విభాగంలో లాస్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ముందంజలో నిలిచి స్వర్ణపతకాలు సాధించారని అన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మహాచండీయాగం

ధర్మవరం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లింగశెట్టిపాళ్యంలో ఉన్న గోశాలలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం వినాయకపూజ, మహాచండీయాగం, రుద్రాభిషేకం, గంగపూజ, నవగ్రహ పూజలను ఘనంగా నిర్వహించారు. అశేషభక్తజనం మధ్య వేదపండితులు రాఘవశర్మ, సీతాపతి శర్మ, రాజశేఖర్, శ్రీకాంత్ బృందంతో వేదమంత్రోచ్చరణాల నడుమ యాగాలు నిర్వహించారు. ముందుగా శివలింగానికి, అమ్మవారికి విశేషపూజలు చేశారు. అనంతరం యాజ్ఞయాగాలు నిర్వహించారు. గోశాలలోని గోవుమాతాలకు పూజలు చేశారు. ప్రతిఒక్కరూ గోవును ఆరాధించి పూజించాలన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మంత్రిని కలిసిన జీసీడీఓ

కొత్తచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష అభియాన్ జీసీడీఓ అనిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను పెనుకొండలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి అనితను అభినందించారు. సక్రమంగా విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌కు చెందినపుల్లయ్య (65) రామగిరి మండలం ఎగువపల్లికి బేల్దారి పనులకు వెళ్లి బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తారక్ చేయూత ట్రస్టు చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవదృష్టికి తీసుకెళ్లడంతో అంత్యక్రియల కోసం రూ.10వేలు మొత్తాన్ని సమకూర్చారు. ఆ మొత్తాన్ని ట్రస్టు సభ్యులు మృతుని భార్యకు అందజేశారు. 26వ వార్డు లక్ష్మీచెన్నకేశవపురంలో వడ్డె వెంకటేశ్(60) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. విషయాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు సుధాకర్, షరీఫ్, గోపాల్, నాగరాజు తదితరులు మృతుడి భార్య గంగమ్మకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని ధర్నా



మలకవేమల క్రాస్‌లో ధర్నా చేస్తున్న స్థానికులు

ముదిగుబ్బ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేమల క్రాస్‌లో రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు బుధవారం ధర్నా చేశారు. కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు రోడ్డు గుంతల మయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో, సంబంధిత అధికారులు కంకర పొడి చల్లారని, ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి రావడంతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

బోరు తవ్వారు.. కనెక్షన్ మరిచారు..



బోరుకు కనెక్షన్ ఇవ్వని అధికారులు

పరిగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 90 ఇళ్ల కాలనీలో నీటి సమస్య వేధిస్తోంది. విషయాన్ని తెలుసుకున్న మంత్రి సవిత బోరు తవ్వించారు. నీరు కూడా సమృద్ధిగా పడింది. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. బోరు తవ్వారేకాని కనెక్షన్ ఇవ్వడం మాత్రం మరిచారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రంగేపల్లిలో పడకేసిన పారిశుధ్యం



మురుగు కాలువ సమీపంలోనే తాగునీటి కొళాయి

సోమందేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో గ్రామస్థులు అనారోగ్యంబారిన పడుతున్నారు. మండలంలోని రంగేపల్లి గ్రామంలో మురుగు కాలువల్లో నీరు ఉంటూ దుర్వాసన వెదజల్లుతోంది. కొన్నిచోట్ల మురుగు కాలువల్లోనే కొళాయిలు ఉన్నాయి. మురుగు కాలవల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. స్వచ్ఛభారత్-స్వచ్ఛాంధ్ర ద్వారా పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నానో యూరియాతో ఆరోగ్యకరమైన పంటలు

వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

మడకశిర రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రసాయన యూరియాకు బదులు నానో యూరియా, నానో డిఏపీ వాడడంతోనే ఆరోగ్యకరమైన పంటలు సాధ్యమని మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప సూచించారు. బుధవారం మండలంలోని బుళ్లసముద్రం, కంఠీపురం గ్రామాల పరిధిలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, రాగి, కంది పంటలను పరిశీలించారు. భూసారాన్ని పెంపొందించడం కోసం ప్రకృతి సేద్యం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు రైతులు పాటించాలన్నారు. కందిపంటకు సోకిన తెగుళ్లకు రైతులకు తగు సూచనాలు, సలహాలు ఇచ్చారు. రబీలో వేరుశనగ పంటను డిసెంబరు 15 వరకు సాగుచేయవచ్చని సూచించారు.

అగళి (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇరిగేపల్లి, గొల్లహట్టి, కోడిపల్లి, ఇరిగేపల్లి, ముక్కడంపల్లి గ్రామాల్లో బుధవారం రైతులకు నూతన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ నాగరాజు మాట్లాడుతూ మొక్కజొన్నలో పంటకోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రాగి, మొక్కజొన్న, ఉలవ, కంది, పూలపంటలపై అవగాహన కల్పించారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా రంగనాథ్



నూతన కమిటీ

మడకశిర రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా రంగనాథ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ తెలిపారు. బుధవారం నూతన కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా రంగనాథ్, ఉపాధ్యక్షుడిగా జూలప్ప, కార్యదర్శిగా రాజు, సహాయకార్యదర్శిగా శరణ్‌గౌడ్, కోశాధికారి యశోద ఎంపికయ్యారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి మురళి, ఆర్‌ఐ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం

పెనుకొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అత్త, భర్త వేధింపులు తాళలేక వివాహిత హారిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కడపజిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు రాజేష్‌తో హారికకు ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలలు అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం భర్త, అత్త వేధింపులు మొదలయ్యాయి. బంగారమంతా లాక్కుని ఇంటి నుంచి బయటికి తరిమేశారు. ఈ క్రమంలో పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు పంచాయతీ చేశారు. అంతటితో ఆగకుండా భర్తకు వేరేపెళ్లి చేయాలనే ఉద్దేశ్యంతో అత్తింటి వేధింపులు చేస్తున్నారని ఈ క్రమంలోనే బుధవారం నిద్రమాత్రలు మింగింది. అపస్మారక స్థితిలో పడిఉన్న హారికను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్

పెనుకొండ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కళాశాలలకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెనుకొండలో నాయకులు, కార్యకర్తలతో కృష్ణదేవరాయల సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారని, అందులో ఏడు కళాశాలలు పూర్తయ్యాయన్నారు. పీపీపీ విధానంతో కూటమి ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ప్రైవేటీకరణ ఆపాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పొగాకు రామచంద్ర, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేయకూడదంటూ బుధవారం హిందూపురంలో వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వైసీపీ ఇన్‌చార్జి దీపిక కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చేవరకు వినతి ఇవ్వమని రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. డీటీ వచ్చి వినతి తీసుకోవడంలో వెళ్లిపోయారు.

ఆయుష్ తీశారు..!

ఆయుష్ ఆస్పత్రుల్లో వైద్య, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీ

మూతపడిన వైనం



కల్లుమర్రిలో మూతపడ్డ హోమియో ఆస్పత్రి

మడకశిర రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆయుష్ పరిధిలో నిర్వహిస్తున్న యునానీ, హోమియోపతి ఆసుపత్రులకు డాక్టర్లు, ఫార్మసిస్టులు, సిబ్బందిలేక మూతపడ్డాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని కల్లుమర్రి, మడకశిర, రొళ్ల, అమరాపురం శంకర్‌గల్, మొరుబాగల్‌లో ఆయుష్ ఆస్పత్రులున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో డాక్టర్, ఫార్మసిస్టు, వర్కర్ ఇలా ముగ్గురు విధులు నిర్వహించాలి. ఈ ఆసుపత్రుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి మంచి చికిత్సలు అందించేవారు. అయితే గత ఐదేళ్లుగా ఈ ఆసుపత్రులో డాక్టర్లు లేకపోవడంతో అవి మూతపడ్డాయి. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలనలో వైద్య రంగానికి పెద్ద పీట వేశామని గొప్పలు చెప్పుకొచ్చారేగానీ, ఈ ఆస్పత్రులకు డాక్టర్లను నియమించలేకపోయారని రోగులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

● యూనాని ఆస్పత్రి మడకశిరలో ఉంది. గతంలో ఈ ఆస్పత్రిలో డాక్టర్, ఫార్మాసిస్టు పనిచేసేవారు. రోగులకు కూడా మంచి వైద్య సేవలు అందించేవారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ నాలుగేళ్ల క్రితం బదిలీపై వెళ్లారు. దీంతో ఫార్మసిస్టు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. అతను కూడా రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి యునాని ఆసుపత్రి మూడపడింది.

● కల్లుమర్రి గ్రామంలో ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి ఉంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు మండల వ్యాప్తంగా కల్లుమర్రిలో ఉన్న హోమియోపతి ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందేవారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ ఐదేళ్ల కిందట బదిలిపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ ఆసుపత్రి ఫార్మసిస్టులతోనే నడుస్తోంది. డాక్టర్ లేకపోయినా ఫార్మసిస్టు ఇచ్చే మందులతోనే రోగులు సంతృప్తిచెందేవారు. ఇక్కడ ఫార్మసిస్టును సైతం రెండేళ్ల క్రితం డిప్యూటేషన్ పై సేవామందిర్‌కు పంపారు. దీంతో హోమియోపతి ఆసుపత్రి మూతపడింది. హోమియోపతి మందులు వాడే రోగులు ఎక్కువగా పట్టణవాసులే. కల్లుమర్రిలో హోమియోపతి ఆస్పత్రి మూతపడటంతో రోగులు హిందూపురానికి వెళ్లి ప్రైవేటు షాపుల్లో మందులు కోనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా నియోజకవర్గంలోని ఐదు ఆయుష్ ఆస్పత్రులు మూతపడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రుల్లో డాక్టర్, ఫార్మసిస్టులను నియమించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి

ఆయుష్ ఆస్పత్రుల్లో డాక్టర్లను నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఎక్కువగా యునానీ, హోమియోపతి మందులు వాడతారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు లేక మూతపడటంతో రోగులు పడే బాధలు వర్ణణాతీతం. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు మందుల షాపుల్లో మందులు కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రులకు డాక్టర్లు నియమించాలి.



-గోవిందప్ప, మణూరు గ్రామం

సమస్యల వలయంలో సచివాలయాలు

అర్థాంతరంగా ఆగినవి కొన్ని...

ప్రారంభానికి నోచుకోనివి మరికొన్ని..

అదనపు బాధ్యతలతో అందుబాటులో లేని సిబ్బంది



సచివాలయం ముందు మట్టికుప్పలు

గోరంట్ల, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయాలు సమస్యల వలయంలో కూరుకుపోయాయి. కనీస వసతులు కూడా లేని పరిస్థితులు ఉన్నాయి. భవనాలు, సిబ్బంది కొరతతో వేధిస్తోంది. గోరంట్ల మండలంలో 20 సచివాలయాల్లో గోరంట్ల-2, బూదిలి, మదలపల్లి సచివాలయ భవనాలు మాత్రం ప్రారంభించడంతో వినియోగంలో ఉన్నాయి. కొన్ని సచివాలయాలు పూర్తి అయినా, చిన్నపాటి మరమ్మతుల వల్ల ప్రారంభానికి నోచుకోలేదు. 12 గ్రామాల్లోని సచివాలయాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. మండలకేంద్రంలో ఐదు సచివాలయాలు ఉండగా అన్నింటిలోనూ సమస్యలు కొలువై ఉన్నాయి. గోరంట్ల-2 సచివాలయం నూతన భవనంలో ఉన్నప్పటికీ కార్యాలయంలోకి వెళ్లడానికి సరైన దారి లేదు. శివాలయం కాలనీలోని వర్షపు నీరంతా సచివాలయం ముందు నిల్వ ఉంటోంది. సమస్య పరిష్కరించడం కోసం మట్టికుప్పలు తోలారుకాని చదునుచేయకపోవడంతో సమస్య ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కార్యాలయం ముందు పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరగడంతో సచివాలయానికి ఎలా వెళ్లాలో దిక్కుతోచని స్థితి నెలకొంది. ఇక సిబ్బంది విషయానికి వస్తే పనిభారంతో అల్లాడిపోతున్నారు. డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సిరికల్చర్ అసిస్టెంట్ ఉన్నప్పటికీ ఐదు సచివాలయాలకు ఒక్కరే అదనపు బాధ్యతలు చేయాల్సి రావడంతో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదు. వీఆర్‌ఓ ఇన్‌చార్జిని నియమించారు. సర్వేయర్ వెరికేషన్‌పై, మహిళ పోలీస్ మెటర్నటీ సెలవులో ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, లైన్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గోరంట్ల మేజర్ పంచాయతీ సచివాలయం 1, 3 కలిపి రాష్ట్ర పట్టుపరిశ్రమ శాఖ గోడౌన్‌లో నిర్వహిస్తున్నారు. సచివాలయం 1లో ఎఎన్‌ఎం, అగ్రికల్చర్ అసిస్టెంట్, లైన్‌మన్ లేరు. సచివాలయం 3లో విఆర్‌ఓ, ఎఎన్‌ఎం, అగ్రికల్చర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంత మార్కెట్‌లోని రైతు సేవా కేంద్రం భవనంలో 4, 5 సచివాలయాలు ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. సచివాలయం 4లో లైన్‌మన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సచివాలయం 5లో పంచాయతీ కార్యదర్శి, లైన్‌మన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మల్లాపల్లి సచివాలయం భవనం పూర్తి అయినా గ్రామానికి దూరంగా ఉండడంతో ప్రారంభం కాలేదు. పూర్తి అయిన భవనాలను వెంటనే ప్రారంభించి మిగిలిన భవనాలను త్వరగా పూర్తి చేసి, సిబ్బంది కొరత తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. మండలంలోని అన్ని సచివాలయాలను పరిశీలించి తగిన చర్యలు చేపడతాను. సిబ్బంది కొరత విషయంలో ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తాం.



-కమలాబాయి, ఎంపీడీఓ, గోరంట్ల

టీడీపీతోనే నిరుపేదలకు సొంత ఇల్లు

మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే నిరుపేదలకు సొంత ఇల్లు సాధ్యమని మంత్రి సవిత అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో బుధవారం కుమ్మరి ఆనందమ్మ నూతన ఇంటి నిర్మాణానికి మంత్రి సవిత భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో 1500 కొత్త ఇళ్లు నిర్మించనున్నామన్నారు. ఇందులో మొదటివిడతగా 90 ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇల్లులేని నిరుపేదలందరికీ ఇల్లు కట్టించి ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం 3లక్షల192 గృహప్రవేశాలు చేయించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించిన ఘనత కూటమి ప్రభుత్వందేనన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా 28034, పీఎంఎవై గ్రామీణ్‌కింద 65292ఇళ్లు పూర్తీచేశామన్నారు. ఈనెల 30లోగా ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

32మంది టీడీపీ కార్యకర్తలకు ఉపాధి

పెనుకొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో ఉన్న ఐఎంఎఫ్‌ఎల్ డిపోలో 32 మంది టీడీపీ కార్యకర్తలకు మంత్రి సవిత ఉపాధి కల్పించారు. బుధవారం ఉపాధిపొందిన టీడీపీ కార్యకర్తలు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం



ఇంటి యజమానికి తాళం అందజేస్తున్న నాయకులు

హిందూపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య పేర్కొన్నారు. బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ముద్దిరెడ్డిపల్లి మార్కెండేయనగర్‌లో నూతనంగా నిర్మించిన ఇళ్లకు సంబంధించి గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అర్హులైన అందరికీ ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఎమ్మెల్యే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టీడీపీ నాయకులు హరీష్ చంద్ర, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

● టీడీపీ నాయకుల డిమాండ్ ● పురంలో భారీ ర్యాలీ

హిందూపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపి అమాయకుల ప్రాణాలు బలిగొన్నవారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హిందూపురంలో టీడీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి మెయిన్‌బజార్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు జాతీయ జెండా చేతబట్టి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ వెంకటేశులు మాట్లాడుతూ డిల్లీలో జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఉగ్రమూక చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా మనం అండగా నిలవాలన్నారు. అంబేడ్కర్‌సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. ర్యాలీలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, నాయకులు రాము, నాగరాజు, నెట్టప్ప, అమర్నాథ్, రాజు, యుగంధర్, భార్గవ్, ప్రవీణ్, అమీన్, కోరుముట్ల నాగేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీలోనే గుర్తింపు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు పడిన కష్టాన్ని గుర్తించి, వారికి సముచిత స్థానాన్ని కల్పించి న్యాయం చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎం.రాయపురం, సి.కొడిగేపల్లి, కరికెర పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిషత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. మండలంలో పార్టీ నిర్మాణం, బలోపేతం తదితర అంశాలపై ఎమ్మెల్యే వారికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. త్వరలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్లు ఈరన్న, లక్ష్మీనరసప్ప, నాగరాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి ముఖంలో ఆనందమే లక్ష్యం

ప్రతి సామాన్యుడి సొంతింటి కల నెరవేర్చి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం చౌటిపల్లి వద్ద టిడ్కో లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే స్వయంగా పాలు పొంగించి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా 68 మంది లబ్ధిదారుల గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరేలా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కమిషనర్ పగడాల జగన్నాథ్, మైనారిటీ ఫైనాన్స్ రాష్ట్ర డైరెక్టర్ బక్షర్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, వైస్‌చైర్మన్ ప్రభావతి, కౌన్సిలర్లు ఉమాశంకర్, సావిత్రమ్మ బలరాం, సుభద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

డీటీసీపీఓ సువర్ణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

పెనుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో అనధికారికంగా నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని అనంతపురానికి చెందిన డీటీసీపీఓ సువర్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం పెనుకొండకు వచ్చిన ఆమె కమిషనర్ సతీష్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ లక్ష్మీపతి, పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిర్మాణంలో ఉన్న కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికారికంగా ఉన్న కట్టడాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సోమందేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్గొండరాయనపల్లి గ్రామంలో రూ.8లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు బుధవారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కొన్నేళ్లుగా రోడ్డు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని, తమ అభ్యర్థన మేరకు మంత్రి సవిత నిధులు విడుదల చేయడం హర్షనీయమని గ్రామస్థులు అంటున్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సూరీ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, వార్డుమెంబర్ రామక్రిష్ణ, నాయకులు హరిక్రిష్ణ, వెంకటేశులు, శ్రీనివాసులు, చిరంజీవి పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

రొద్దం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రొద్దం హరిజనవాడలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈఓఆర్డీ గోవిందప్ప వీధి దీపాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించారు. బుధవారం రొద్దం కొత్త హరిజనవాడలో వీధి దీపాలు ఏర్పాటుచేయించారు. కాలనీవాసులు సమస్యలను విన్నవించుకోగా వెంటనే పరిష్కారం చూపడంతో అధికారులకు, సర్పంచ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి

సోమందేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని రైల్వేగేటువద్ద అదే గ్రామానికి చెందిన చాకలిబాబు(25) రైలు కింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు మృతిచెందాడా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదినారాయణ, యల్లమ్మ కుమారుడు చాకలిబాబు సోమందేపల్లిలోని ఓ సిల్కుహౌస్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల నిర్మించిన నూతన గృహానికి సంబంధించి కొంత ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో బాబు కియా అనుబంధ పరిశ్రమలో పనికి వెళ్లడానికి కుటుంబ సభ్యులను అడిగాడు. వారు మందలించగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. వాస్తవాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయండి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

గుడిబండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో గురువారం నిర్వహించనున్న వాల్మీకి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం తదితరులు హాజరవుతారన్నారు.

కోలాహలంగా త్రిమూర్తుల ఊరేగింపు

రొళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.గొల్లహట్టి గ్రామంలో త్రిమూర్తుల ఊరేగింపు మంగళవారం రాత్రి కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి దేవతామూర్తులకు వివిధ పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, రాష్ట్ర కుంచిటిగ వక్కళిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ ఈరన్న, మాజీ ఎంపీపీ కృష్ణా, కార్యదర్శి ఉగ్రేగౌడ్, మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చారు.

వ్యక్తి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

రొళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీజీహళ్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి(35) 13 రోజులుగా కనబడటంలేదని తన అన్న దేవరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూర్తికి మతిస్థిమితం సరిగాలేదని, తెల్లటిషర్ట్, నీలంరంగు బర్మోడ ధరించాడని, ఆచూకీ తెలిస్తే 9686451554కు సమాచారం అందించాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పరిగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఇటీవల డిల్లీలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు మండలంలో స్థానికంగా ఉన్న దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండుల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అధికారులు, దుకాణదారులకు ఈ మేరకు బుధవారం నోటీసులను అందించారు.